

# కోయిలా... కూ...ఇలా...

మా బడి, మా గుడి
అందులో దైవాలు
మా గురువులే
వారికి ఏ పరిమళ
సుమ పూజలుండవు
మరే సుజలాభిషేకాలు లేవు
అయినా- దైవం కన్నా ప్రేమగా
అమ్మ కన్నా అభిమానంగా
నాన్న కన్నా ఆత్మీయంగా
మమ్మల్ని ప్రేమించే
మానవతామూర్తులు
సంఘంలో మేమెలా మెలగాలో నేర్పే
మార్గ నిర్దేశకులు
చదువుతో పాటు
నీతి, న్యాయం, ధర్మం బోధించే
బుద్ధులు మా గురువులు
మాలో బతుకుపై తీపిని
ఒడిదుడుకులు తట్టుకునే
ధైర్యం నింపే ధీశాలురు వారు
అలాంటి త్రిమూర్తి స్వరూపాలకు
ఏమిచ్చినా ఎంత కొలిచినా
తీరదు మా ఋణం
మా బడి తలుపులు
మా గురువుల చేతులు
మాకెపుడూ స్వాగతం
చెప్తూనే ఉంటాయి
అందుకే మా బడి, గుడి
మా గురువులే దైవాలు మాకు!

- కాకరాల భానుమతి
(హైదరాబాద్)



# తేడా!

కొన్ని ఆలోచనలంతే
వాటికి అస్తిత్వముండదు
మఖలో పుట్టి పుబ్బలో అంతమవుతాయి
మానవత్వం... మంచితనం అలాంటివే
మాటల్లో ఘనంగా విన్పించి
చేతల్లో శూన్యమవుతాయి...
మరికొన్ని ఆలోచనలు
ఆచరణకి అందుబాటులో
సదా మనని అంటిపెట్టుకునే వుంటాయి
డబ్బు సంపాదన రంధిలో తలమునకలవుతూ
విలువలకి తిలోదకాలివ్వడానికి
ఆస్కారమవుతాయి
వాటి ఆకర్షణశక్తికి అందరూ దాసోహమే!
మనసు తక్కెడ అటు మొగ్గితే
వాళ్లు మాననీయులు, మహనీయులు
ఇటైతే... జనించి నశించే
సాధారణ జనావళి!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (సికింద్రాబాద్)